మహాలక్ష్మిగా అమ్మవారు దర్శనం

నర్సంపేట: మహాలక్ష్మి అవతారంలో..

గిర్మాజీపేట: కాశీవిశాలాక్షి

నెక్కొండ/నర్సంపేట/నర్సంపేటరూరల్/గిర్మాజీపేట/ గీసుగొండ, అక్టోబర్ 8: దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా దుర్గామాత మంగళవారం మహాలక్ష్మి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. నెక్కొండ శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయంలో ఆరో రోజు దుర్గామాతను షష్టి పర్వదినాన సకల సౌభాగ్యాలను ప్రసాదించే మహాలక్ష్మిగా కొలిచినట్లు అర్చకుడు బీవీఎన్ శాస్త్రి, వేద జ్యోతిష్య పండితుడు బూరుగుపల్లి శ్రవణ్ శాస్త్రి తెలిపారు. నర్సంపేటలోని వాసవీ కల్యాణ మండపంలో అమ్మవారిని శాకంబరీగా అలంకరించి పూజలు అందించారు. శింగిరికొండ మాధవశంకర్ ఆధ్వర్యంలో చండీహోమం నిర్వహించారు. నర్సంపేటలోని వల్లభ్‌నగర్‌లో ఏసీపీ కిరణ్‌కుమార్, సీఐ రమణకుమార్, ఎస్సై అరుణ్‌గౌడ్, రవికుమార్ పూజలు చేశారు. అంబేద్కర్ సెంటర్‌లో భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నర్సంపేట మండలంలో 6వ రోజు సందర్భంగా మహాలక్ష్మి అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. మాదన్నపేట, సర్వాపురంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. వరంగల్ స్టేషన్‌రోడ్‌లోని ఆకారపు వారి గుడిలో కాశీవిశాలాక్షి అమ్మవారు మహాలక్ష్మిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానార్చకుడు లంకా శివకుమార్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. వరంగల్ 26వ డివిజన్ ఎల్లమ్మగుడి ప్రాంగణంలో మిత్రయూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య పాల్గొని భక్తులకు అన్నం వడ్డించారు. గ్రేటర్ వరంగల్ 16వ డివిజన్ ధర్మారంతోపాటు మండలంలోని మచ్చాపురంలో దుర్గామాత మండపాల వద్ద చండీహోమం నిర్వహించారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం చేశారు.

బంజారాల ఉనికిని ప్రపంచానికి చాటిన మోదీ

మాట్లాడుతున్న మాజీ ఎంపీ సీతారాంనాయక్

నర్సంపేట, అక్టోబర్ 8: స్వాతంత్ర్య భారత దేశంలో ఏ ప్రధానమంత్రి నోటరాని బంజారాల ఇతిహాస మాట మోదీ నోట వచ్చిందని మాజీ ఎంపీ అజ్మీరా సీతారాంనాయక్ అన్నారు. నర్సంపేటలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బంజారాల ఇతిహాసాన్ని వెలికి తీసి ప్రపంచానికి చాటారన్నారు. ప్రధానమంత్రి మోదీకి సమస్త బంజారా సమాజం రుణపడి ఉందన్నారు. బంజారాలపై తాము చెప్పిందే నిజమైందని, అఖండ భారతదేశంలో ఆదిమ బంజారాలకు భరత ఉపఖండానికి ఎంత చరిత్ర ఉందో బంజారాలకు అంతే చరిత్ర ఉందన్నారు. వీరి సంస్కృతీ సంప్రదాయాలు హరప్పా, సింధు నాగరికతను పోలి ఉన్నాయని వివరించారు. వీరి చరిత్ర వెలుగులోకి రాకపోవడంతో గాలిలో దీపంలా వేలాడుతున్నా పట్టించుకునే నాథుడే లేడన్నారు. తొలిసారిగా మహారాష్ట్రలోని వాసిం జిల్లా పౌరాదేవిలో రూ. 900 కోట్లతో నంగారాభేరి భవన్‌ను నిర్మించి ప్రారంభించారన్నారు. బంజారా భాషను రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చాలని, సంత్ సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. బుధవారం నర్సంపేటలో ప్రధానమంత్రి మోదీ చిత్రపటానికి పాలాభిషేకం, ర్యాలీ నిర్వహిస్తామని తెలిపారు. గిరిజనులు అధిక సంఖ్యలో హాజరు కావాలని ఆయన కోరారు.

మూడేళ్ల బాలుడి అప్పగింత

ఖిలావరంగల్, అక్టోబర్ 8: వరంగల్ క్రిస్టియన్‌కాలనీకి చెందిన మూడేళ్ల బాలుడు మంగళవారం సాయంత్రం ఇంటి ముందు ఆడుకుంటూ రోడ్డుపై నడుచుకుంటూ వెళ్లిపోయాడు. వెంటనే బాలుడి తండ్రి ఎండీ అజీం మిల్స్‌కాలనీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు ఎస్సై రవీందర్, హెడ్‌కానిస్టేబుల్ ఉస్మాన్, బ్లూకోర్ట్ పోలీసులు సహాయంతో క్రిస్టియన్‌కాలనీ, లేబర్‌కాలనీ, అబ్బనికుంటలో వెతికారు. బాలుడి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

బతుకమ్మలతో వస్తున్న మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

బల్దియా ఆవరణలో బతుకమ్మ ఆడుతున్న వరంగల్ కలెక్టర్, మేయర్, కమిషనర్, మహిళా కార్పొరేటర్లు

బల్దియాలో బతుకమ్మ సంబురం

- హాజరైన వరంగల్ జిల్లా కలెక్టర్, మేయర్, గ్రేటర్ కమిషనర్
- ఉత్సాహంగా పాల్గొన్న కార్పొరేటర్లు, మహిళా ఉద్యోగులు

వరంగల్, అక్టోబర్ 8 : బల్దియా ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబురాలు అంబరాన్నంటాయి. గ్రేటర్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఆవరణలో మంగళవారం బతుకమ్మ వేడుకలను నిర్వహించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, మహిళా కార్పొరేటర్లు, మహిళా ఉద్యోగులు ఉత్సహంగా పాల్గొన్నారు. కలెక్టర్, మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు, ఉద్యోగులు బతుకమ్మ ఆడారు. విద్యుత్ లైట్ల వెలుగుల్లో బతుకమ్మ సంబురాలను సంప్రదాయ బద్ధంగా జరుపుకున్నారు. తంగేడు, గునుగు, చామంతి, బంతి పూలతో అందంగా పేర్చిన బతుకమ్మలను చేతబట్టుకొని మేయర్, కమిషనర్, కార్పొరేటర్లు వచ్చారు. సుమారు రెండు గంటల పాటు బతుకమ్మ సంబురాలు నిర్వహించారు.

తెలంగాణ సంస్కృతికి ప్రతీక బతుకమ్మ : గుండు సుధారాణి, మేయర్

తెలంగాణ సంస్కృతికి బతుకమ్మ ప్రతీక అని మేయర్ గుండు సుధారాణి అన్నారు. నగర ప్రజలందరికీ బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ప్రజల జీవితాల్లో బతుకమ్మ సంబురం మమేకం అయిందన్నారు.

బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు.. - కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే

నగర ఆడబిడ్డలకు బతుకమ్మ శుభాకాంక్షలు. బతుకమ్మ పండుగ ప్రజలకు సంతోషాలను తీసుకురావాలి. బతుకమ్మ పండుగకు చెరువుల వద్ద బల్దియా ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశాం. తెలంగాణలో అతి పెద్ద పండుగ బతుకమ్మ, దసరా ఉత్సవాలు ప్రజలు సంతోషంగా జరుపుకోవాలి.

కార్యక్రమంలో కార్పొరేటర్లు దేవరకొండ విజయలక్ష్మి, గుండు చందన, షీభారాణి, పల్లం పద్మ, ముప్కమల్ల అరుణ, పోశాల పద్మ, బస్వరాజు శిరీషా, రజాలీ, తూర్పాటి సులోచన, బైరబోయిన ఉమా, బల్దియా డిప్యూటి కమిషనర్ ప్రసన్నరాణి, కార్యదర్శి విజయలక్ష్మి, హెచ్‌వో ప్రిసిల్లా పాల్గొన్నారు.

డీఎస్సీలో మెరిసిన ఆణిముత్యాలు

- జిల్లా నుంచి పలువురు ఎంపిక
- హర్షం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు, కుటుంబ సభ్యులు

చెన్నారావుపేట : ఉద్యోగాలు సాధించిన రోజా-రంజిత్ దంపతులు

నల్లబెల్లి : కుమార్తె శ్వేతకు స్వీటు తినిపిస్తున్న తల్లిదండ్రులు

చెన్నారావుపేట, అక్టోబర్ 8: డీఎస్సీ-2024 ఫలితాల్లో జిల్లా మెరిసింది. చెన్నారావుపేట మండలంలోని ఉప్పరపల్లి గ్రామం నుంచి 8 మంది అభ్యర్థులు ఉద్యోగాలు సాధించారు. మేరుగు హరి, బొమ్మెర సతీశ్, పల్లకొండ శిల్ప, కుక్కల శ్రుతి, పులిచేరు మహేశ్, సంగెం కార్తీక్, బోదె దివ్య ఎస్‌జీటీలుగా ఎంపికయ్యారు. వీరందరూ మధ్య తరగతి కుటుంబాలకు చెందిన వారు కావడం విశేషం. కష్టపడి చదివి ఒకే గ్రామం నుంచి 8 మంది ఉద్యోగాలు సాధించడం సంతోషంగా ఉందని గ్రామస్తులు, తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు. అలాగే, లింగాపురం గ్రామానికి రాయరాకుల రోజా-రంజిత్ దంపతులు, చెన్నారావుపేటకు చెందిన హంస రామకృష్ణ సోషల్ స్టడీస్‌లో స్కూల్ అసిస్టెంట్‌గా ఉద్యోగాలు సాధించారు.

6 గెజిటెడ్ ఉద్యోగాలు..

నల్లబెల్లి: ప్రభుత్వం ప్రకటించిన ఫలితాల్లో మండలకేంద్రానికి చెందిన యువతి ఆరు గెజిటెడ్ ఉద్యోగాలు సాధించింది. నల్లబెల్లికి చెందిన వడ్లూరి విష్ణు-రమ కూతురు శ్వేత స్థానిక ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి వరకు చదివింది. అనంతరం వరంగల్ పాలిటెక్నిక్ కళాశాలలో సివిల్ ఇంజినీర్ పూర్తి చేసింది. ఈసెట్‌లో స్టేట్ మొదటి ర్యాంక్ సాధించింది. అలాగే, ఓయులో బీఈ, గేట్ పరీక్ష ద్వారా ఎంఈ పూర్తి చేసి విశ్వవిద్యాలయంలో టాపర్‌గా నిలిసింది. శ్వేత ఏఈఈ బాలికల విభాగంలో స్టేట్ 7వ ర్యాంకు, పాలిటెక్నిక్ లిట్రసీ స్టేట్ రెండో ర్యాంకు, ఐఎస్ఆర్‌వో నెల్లూరు-బెంగుళూరులో నేషనల్ టాఫర్, ఏఈ బాలికల విభాగంలో స్టేట్ మూడో ర్యాంకు, టౌన్ ప్లానింగ్ ఆఫీసర్ (టీపీడీవో)లో స్టేట్ 14వ ర్యాంకు, జోన్ 4లో స్టేట్ 5వ ర్యాంకు సాధించి ఓపెన్ కేటగిరీలో ఆరు గెజిటెడ్ ఉద్యోగాలకు శ్వేత అర్హత సాధించింది. అయితే, కరీంనగర్ సబ్ డివిజన్‌లోని ఆర్‌అండ్‌బీ శాఖలో ఏఈఈగా ఉద్యోగంలో చేరింది. ఈ సందర్భంగా తల్లిదండ్రులు, గ్రామస్తులు శ్వేతను అభినందించారు.

నాలుగు ఉద్యోగాలకు ఎంపిక

సుకుమార్

పర్వతగిరి: మండలంలోని దౌలత్ నగర్ శివారు బాజు తండాకు చెందిన మాలోత్ సుకుమార్ ఒకేసారి నాలుగు ఉద్యోగాలు సాధించి ఆదర్శంగా నిలిశాడు. వరంగల్ ఎన్ఐటీలో ఎంటెక్ పూర్తి చేసిన సుకుమార్ ఇటీవల వెలువడిన ఫలితాల్లో ఏఈఈ, ఏఈ, ఎస్ఎస్‌సీజేఈ, పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగాలకు సెలెక్ట్ అయ్యాడు. చిన్నప్పటి నుంచి కష్టపడి చదివిన సుకుమార్ మంచి ఉద్యోగాలు సాధించడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

సద్దుల బతుకమ్మ, దసరా పండుకు అధికారులు ఏర్పాట్లు చేయాలి

భద్రకాళీ, వడ్డేపల్లి చెరువులను పరిశీలించిన మేయర్

వరంగల్, అక్టోబర్ 8 : తెలంగాణలో అతి పెద్ద పండుగలైన సద్దుల బతుకమ్మ, దసరా ఉత్సవాలకు బల్దియా పక్షాన అన్ని ఏర్పాట్లను త్వరగా పూర్తి చేయాలని మేయర్ గుండు సుధారాణి అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె బల్దియా అధికారులతో కలిసి హనుమకొండలోని వడ్డేపల్లి చెరువు, భద్రకాళీ చెరువుతో పాటు పలు బతుకమ్మ ఆట స్థలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇప్పటికే బతుకమ్మలను నిమజ్జనం చేసే చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపు ప్రక్రియ పూర్తయిందన్నారు. రంగసముద్రం, వడ్డేపల్లి, చిన్న వడ్డేపల్లి, కట్టమల్లన్న, మామునూరు చెరువు, మంగళమ్మ కుంట, బెస్తం చెరువు, మెట్టు దర్వాజ చెరువుల్లో గుర్రపు డెక్క తొలగించామని పేర్కొన్నారు. బతుకమ్మ విగ్రహాలకు రంగులు వేస్తున్నామని తెలిపారు. బతుకమ్మ ఆట స్థలాలను చదును చేసే పనులు కొనసాగుతున్నాయన్నారు. పద్మానగర్, శాంతినగర్‌లో బుధవారం నాటికి పనులు పూర్తి చేస్తామన్నారు. బతుకమ్మ ఆట స్థలాల్లో లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రంగలీలా మైదానంలో అత్యంత వైభవంగా జరిగే రావణ వధ ఉత్సవానికి పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. భద్రకాళీ ఆలయంలో దసరా రోజు జరిగే తెప్పోత్సవం కార్యక్రమానికి చేస్తున్న పనులను ఆమె పరిశీలించారు. కార్యక్రమంలో 11వ డివిజన్ కార్పొరేటర్ దేవరకొండ విజయలక్ష్మి, సురేందర్, ఎస్ఈ రాజయ్య, ఈఈ మహేందర్, డీఈ సారంగం పాల్గొన్నారు.

పండుటాకులపై 'పన్ను' భారం

పండగపూట ఇంటి పన్నుల వసూలు.. ఫించన్ డబ్బులు లాక్కున్న అధికారులు

రసీదులు చూపిస్తున్న గొల్లపల్లికి చెందిన బత్తిని ఐలమ్మ గోనె రాధమ్మ

నల్లబెల్లి, అక్టోబర్ 8: వృద్ధులు ఎవరిపై ఆధారపడకుండా సమాజంలో గౌరవంగా తలెత్తుకొని బతకాలనే సదుద్దేశంతో గత కేసీఆర్ సర్కారు ఆసరా ఫించన్లను రూ. 2000 వేలకు పెంచింది. దీంతో వారు కుటుంబ సభ్యులపై ఆధారపడకుండా బతుకుతున్నారు. ఈ క్రమంలో ప్రస్తుత ప్రభుత్వ చర్యల వల్ల వారు పస్తులుండాల్సిన పరిస్థితులు దాపురిస్తున్నాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని గొల్లపల్లి గ్రామ పంచాయతీ వర్కర్ల వేతనాలు చెల్లించాలనే సాకుతో మంగళవారం కార్యదర్శి వృద్ధుల నుంచి ఇంటి, నల్లా పన్నులు వసూలు చేశారు. పండుగ పూట తమను ఇబ్బంది పెట్టొద్దు సారూ.. అని వేడుకున్నా అమాయక వృద్ధుల నుంచి రూ. 200 నుంచి రూ. 440 వసూలు చేశారు. ఇంటి పన్ను తమ కుమారులను అడగాలని, ఇంకా పన్నులు కట్టేందుకు మూడు నెలల సమయం ఉందని మహిళలు, గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా బత్తిని ఐలమ్మ(వృద్ధురాలు) మాట్లాడుతూ 'పాకశాలలో ఉంటున్నం. కొడుకులు, కోడళ్లు బంగ్లాల్లో ఉంటరు. గావాళ్ల దగ్గర ఇల్లు, నల్లా పన్ను వసూలు చేసుకోవాలి కదా సారూ.. అని వేడుకున్నా కార్యదర్శి కనికరం సూపలేదు. కేసీఆర్ సార్ సల్లగుండా. మమ్ములను పెద్ద కొడుకులెక్క ఆదుకుండు. ఇప్పుడేమో అధికారులు ఇబ్బంది పెడుతుండ్రు. మా గోస తగులుద్ది' అని శాపనార్థాలు పెట్టింది. గోనె రాధమ్మ మాట్లాడుతూ 'గ్రామ పంచాయతీ సార్లకు ప్రభుత్వం పైసలిత్తలేదా. పన్నుల కోసం ముసలోళ్ల పైసలే కాలాల్నా. కాల్లెల్లా పడ్డా కార్యదర్శి ఇనుపించుకోలే. ఊళ్లో అందరి ముసలోల్ల పింఛన్ పైసలను కార్యదర్శి లాక్కుండు' అని ఆవేదన వ్యక్తం చేసింది. ఈ విషయమై ఎంపీడీవో నర్సింహమూర్తిని వివరణ కోరగా.. పన్నుల వసూలు కోసం పింఛన్ డబ్బులు తీసుకోవడం నిబంధనలకు విరుద్ధం. పన్నుల వసూలు కోసం పింఛన్ డబ్బులు కట్ చేయాలనే ఆదేశాలు లేవు. విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

వాణిజ్య

సామ్‌సంగ్ టాప్

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: స్మార్ట్‌ఫోన్ల తయారీ సంస్థ సామ్‌సంగ్ మరోసారి సత్తాను చాటింది. ప్రస్తుత పండుగ సీజన్ తొలి విడుతలో కంపెనీ మొబైళ్లకు కొనుగోలుదారుల నుంచి విశేష స్పందన లభించింది. ఈ సీజన్‌లో అమ్ముడైన ఫోన్లలో 20 శాతం మార్కెట్ వాటాతో సామ్‌సంగ్ తొలిస్థానంలో నిలిచిందని టెక్ ఇన్‌సైట్స్ విడుదల చేసిన నివేదికలో వెల్లడించింది. అలాగే సెప్టెంబర్ 26 నుంచి అక్టోబర్ 6 వరకు కేవలం 11 రోజుల్లోనే 10 లక్షలకు పైగా ఐఫోన్లు కొనుగోలు చేశారు. అత్యధికంగా అమ్ముడైన ఫోన్లలో గెలాక్సీ ఎం35, గెలాక్సీ ఎస్23, గెలాక్సీ ఏ14, గెలాక్సీ ఎస్23 ఎఫ్ ఈలు ఉన్నాయి. బిగ్ బిలియన్ డేస్ పేరుతో ఫ్లిప్‌కార్ట్ ప్రత్యేక ఆఫర్లు ప్రకటించగా, అమెజాన్ ఇండియన్ ఫెస్టివల్ పేరుతో ఆఫర్లను తీసుకొచ్చాయి.

టాటా టెక్నాలజీస్‌తో బీఎండబ్ల్యూ జట్టు

ముంబై, అక్టోబర్ 8: టాటా టెక్నాలజీస్, బీఎండబ్ల్యూ గ్రూప్ జట్టు కట్టాయి. మంగళవారం తమ జాయింట్ వెంచర్ (జేవీ)ను అధికారికంగా ప్రకటించాయి. బీఎండబ్ల్యూ టెక్ వర్క్స్ ఇండియా పేరిట ఈ జేవీని తెచ్చారు. సాఫ్ట్‌వేర్ డిఫైన్డ్ వెహికిల్స్ (ఎస్‌డీవీ)సహా ఆటోమోటివ్ సాఫ్ట్‌వేర్, ఐటీ వ్యాపారం కోసం డిజిటల్ ట్రాన్స్‌ఫార్మేషన్ సొల్యూషన్స్‌ను ఇది అభివృద్ధి చేయనున్నది. కాగా, 100 మంది ఉద్యోగులతో ఇది మొదలు కానున్నది. పుణె, బెంగళూరు, చెన్నై ఆధారంగా కార్యకలాపాలు సాగుతాయి.

ఎఫ్ఎంసీజీపై పామాయిల్ పిడుగు

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: అంతర్జాతీయ మార్కెట్లో భగ్గుమంటున్న పామాయిల్ ధరలు దేశీయ ఎఫ్ఎంసీజీ రంగ సంస్థల లాభాలపై తీవ్రస్థాయిలో ప్రభావం చూపనున్నది. సెప్టెంబర్ త్రైమాసికంలో ఆయా సంస్థల లాభాలు భారీగా తగ్గే అవకాశాలున్నాయని సర్వే వెల్లడించింది. ఒకవైపు పామాయిలు ధరలు, మరోవైపు ఉత్పత్తి వ్యయం, ప్రకటనలకోసం అధికంగా నిధులు వెచ్చించడంతో మార్జిన్లు, లాభాలపై ప్రతికూల ప్రభావం పడనున్నది. గోద్రెజ్ కన్స్యూమర్ ప్రొడక్ట్స్, డాబర్, మారికోలు తమ లాభాలు ఏడాది కనిష్ఠ స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని పేర్కొన్నాయి.

హైదరాబాద్‌లో 'రియల్' డౌన్

19 శాతం తగ్గిన ఇండ్ల అమ్మకాలు దేశీయ ప్రధాన నగరాల్లోనే అత్యధికం

జూలై-సెప్టెంబర్‌లో 11,564 యూనిట్లకే పరిమితం ప్రాప్‌టైగర్ తాజా సర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: రాష్ట్ర రియల్ ఎస్టేట్ మార్కెట్ మందగమనంలోకి జారుకున్నది. హైదరాబాద్‌లో వరుసగా పడిపోతున్న ఇండ్ల అమ్మకాలు దీన్నే సూచిస్తున్నాయి మరి. ఈ ఏడాది జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలోనూ గృహ విక్రయాలు నీరసంగానే సాగాయి. ప్రముఖ రియల్ ఎస్టేట్ బ్రోకరేజీ వేదిక ప్రాప్‌టైగర్.కామ్ మంగళవారం దేశీయ రెసిడెన్షియల్ మార్కెట్‌పై 'రియల్ ఇన్‌సైట్' పేరిట విడుదల చేసిన నివేదిక ప్రకారం.. గత నెల సెప్టెంబర్‌తో ముగిసిన 3 నెలల్లో హౌజింగ్ సేల్స్ ఏకంగా 19 శాతం దిగజారాయి. దేశంలోని 7 ప్రధాన నగరాల్లో ఇదే అత్యధికం కావడం గమనార్హం. నిరుడు జూలై-సెప్టెంబర్‌లో 14,191 యూనిట్ల అమ్మకాలు జరిగాయి. ఈ ఏడాది ఇదే సమయంలో 11,564 యూనిట్లకే పరిమితమయ్యాయి.

బయ్యర్లలో తగ్గిన ఆసక్తి

గత ఏడాదిదాకా హైదరాబాద్‌లో పరుగులు పెట్టిన స్థిరాస్తి మార్కెట్.. ఇప్పుడు పడకేసింది. ప్రస్తుతం కొనుగోలుదారుల్లో ఇండ్లను కొనాలన్న ఆసక్తే కనిపించట్లేదని వ్యాపారులు చెప్తున్నారు. మార్కెట్‌లో నెలకొన్న ఇబ్బందికర పరిస్థితులు ఒక కారణమైతే.. రుణ లభ్యత కఠినం కావడం మరో కారణమని వారు అంటున్నారు. కాగా, పరిస్థితులు ఇలాగే సాగితే కేవలం నిర్మాణ రంగమేగాక, దాని అనుబంధ రంగాలూ సంక్షోభంలోకి జారుకుంటాయని ఇండస్ట్రీ నిపుణులు హెచ్చరిస్తున్నారు.

హైడ్రా ఎఫెక్ట్

రాష్ట్ర రియల్ ఎస్టేట్ రంగంలో హైడ్రా ప్రకంపనల్ని సృష్టిస్తున్నది. హైదరాబాద్‌లో తెచ్చిన హైడ్రా.. ఇతర నగరాల్లోని లావాదేవీలపైనా గట్టి ప్రభావాన్నే చూపుతున్నది. ఇక రాజధానిలోనైతే హైడ్రా దెబ్బకు బయ్యర్లు.. ముఖ్యంగా ఎగువ మధ్యతరగతి వర్గాలు ఇండ్లు, ఫ్లాట్లు, ప్లాట్లు కొనాలనే ఆలోచనే వాయిదా వేసుకుంటున్నారు. దీంతో కొత్త నిర్మాణాలన్నీ ఆగిపోయాయి. ఇప్పటికే పూర్తయిన ఇండ్లనూ కొనే వారు లేకపోవడంతో పెట్టిన పెట్టుబడుల్ని రాబట్టుకొనేందుకు తక్కువ ధరలకు ఇస్తామన్నా ఆదరణే కరువైపోయింది. ఫలితంగా రియల్టర్లు ఆందోళన, ఆవేదన చెందుతున్నారు.

దేశవ్యాప్తంగా..

హైదరాబాద్‌సహా మొత్తం దేశంలోని 8 ప్రధాన నగరాల్లో ప్రాప్‌టైగర్.కామ్ తాజా సర్వే జరిగింది. ఇందులో ఢిల్లీ-ఎన్‌సీఆర్ మినహా మిగతా 7 నగరాల్లోనూ హౌజింగ్ సేల్స్ పతనమైనట్టు స్పష్టమైంది. అయితే టాప్-7 నగరాల్లో హైదరాబాద్‌లోనే అత్యధికంగా ఇండ్ల అమ్మకాలు తగ్గినట్టు తేలింది. కాగా, ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో 29 శాతం విక్రయాలు పెరిగాయి. గతంతో పోల్చితే 7,800 యూనిట్ల నుంచి 10,098 యూనిట్లకు ఎగిశాయి. కోల్‌కతాలో గరిష్ఠంగా 22 శాతం క్షీణించాయి. 3,607 యూనిట్ల నుంచి 2,796 యూనిట్లకు పడిపోయాయి. ఇక బెంగళూరులో 11 శాతం, అహ్మదాబాద్‌లో 9 శాతం, చెన్నైలో 8 శాతం, పుణెలో 3 శాతం, ముంబైలో 1 శాతం చొప్పున సేల్స్ దిగజారాయి.

బీవైడీ సరికొత్త ఈవీ

సింగిల్ చార్జింగ్‌తో 530 కిలోమీటర్లు..

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: చైనాకు చెందిన ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ..దేశీయ మార్కెట్లోకి మరో మాడల్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈమ్యాక్స్ 7 రూ.26.9 లక్షల నుంచి రూ.29.9 లక్షల మధ్యలో లభించనున్నది. వీటిలో ఆరుగురు కూర్చోవడానికి వీలుండే మాడల్ ధర రూ.26.90 లక్షలు, ఏడు సీట్ల మాడల్ ధర రూ.27.50 లక్షలు, సూపరియర్ మాడల్ రూ.29.30 లక్షల నుంచి రూ.29.90 లక్షల మధ్యలో లభించనున్నది. దీంట్లో 55.4 కిలోవాట్ల బ్యాటరీ ప్రీమియం మాడల్ సింగిల్ చార్జింగ్‌తో 420 కిలోమీటర్లు ప్రయాణించనుండగా, అలాగే 71.8 కిలోవాట్ల బ్యాటరీ కలిగిన మాడల్ 530 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. 10.1 సెకండ్లలో 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్న ఈ కారు గంటకు 180 కిలోమీటర్లు ప్రయాణించనున్నది. ఆటోమేటిక్ క్లైమెట్ కంట్రోల్, వైర్‌లెస్ చార్జర్, ఎయిర్ ప్యూరిఫైర్, మూడు ఎయిర్‌బ్యాగ్‌లు వంటి ఫీచర్స్ ఉన్నాయి. ఈ సందర్భంగా బీవైడీఇండియా హెడ్ రాజీవ్ చౌహాన్ మాట్లాడుతూ..దేశీయంగా ప్రవేశపెట్టిన నూతన ఈవీ పాలసీలో ప్రయోజనాలు పొందడానికి దరఖాస్తు చేసుకునే అవకాశాలు లేవని స్పష్టం చేశారు.

ఈసారి కూడా వడ్డీరేట్లు యథాతథమే!

న్యూఢిల్లీ, అక్టోబర్ 8: ఈసారి కూడా రిజర్వుబ్యాంక్ వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయి. దేశవ్యాప్తంగా కూరగాయల ధరలు భగ్గుమంటుండటంతో ఆహార ద్రవ్యోల్బణ సూచీ గరిష్ఠ స్థాయిలోనే నమోదవుతుండటంతో బుధవారం ప్రకటించనున్న తన పరపతి సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచే అవకాశాలున్నాయని ఇండస్ట్రీ వర్గాలు అంచనావేస్తున్నారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి మాత్రం వడ్డీరేట్లను అర శాతం తగ్గించేందుకు ఆస్కారం ఉన్నదని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ ఎండీ, సీఈవో ధీరజ్ రెల్లి తెలిపారు. వరుసగా పది సమీక్షలో వడ్డీరేట్లను ముట్టుకోకపోవడంతో రెపోరేటు 6.50 శాతం వద్ద కొనసాగుతున్నది. దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగా ఉండటం, పశ్చిమ దేశాల్లో యుద్ధమేఘాలు కమ్ముకోవడంతో చమురు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉన్నదని, ఈ నేపథ్యంలో వచ్చే రెండు సమీక్షల్లో ప్రస్తుత రేట్లను కొనసాగించే అవకాశాలున్నాయన్నారు. తొలి త్రైమాసికంలో వృద్ధి 7.5 శాతం సాధించింది.

హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్

హైదరాబాద్, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): హైదరాబాద్ శివార్లో ప్రత్యేకంగా తైవాన్ పరిశ్రమ పరిశ్రమల కోసం ప్రత్యేకంగా ఓ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. దండుమల్కాపూర్‌కు సమీపంలో ఈ పార్క్‌ను ఏర్పాటు చేయాలని నిశ్చయించారు. ఇందుకు సంబంధించి తైవాన్ చాంబర్ ఆఫ్ కామర్స్(టీసీసీ) ఉపాధ్యక్షుడు సైమన్ లీ, టీజీఐఐసీ ఎండీ విష్ణువర్ధన్ రెడ్డి మంగళవారం టీజీఐఐసీ కార్యాలయంలో ద్వైపాక్షిక ఒప్పందంపై సంతకాలు చేశారు. దండుమల్కాపూర్ సమీపంలో ఇప్పటికే ఉన్న 600 ఎకరాల ప్రభుత్వ భూమితోపాటు మరో 400 ఎకరాలు సేకరించి మొత్తం వెయ్యి ఎకరాల్లో ఈ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేయాలని గత కేసీఆర్ ప్రభుత్వం ప్రతిపాదనలు చేసింది. తైవాన్ నుంచి రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ఈ ఒప్పందం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. హైదరాబాద్‌లో తైవాన్ ఇండస్ట్రియల్ పార్క్ ఏర్పాటు కోసం ఇప్పటికే రూపకల్పన జరిగిందని, పెట్టుబడిదారులతో సమావేశాలు, రాష్ట్రాన్ని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం లాంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

హమ్మయ్య..కోలుకున్నాయి

సెన్సెక్స్ 584, నిఫ్టీ 217 పాయింట్ల లాభం • 7.5 లక్షల కోట్లు పెరిగిన మదుపరుల సంపద